# ముగ్గురు బిచ్చగాళ్ళు

(భారతి : 1951 – జనవరి)

ఇరవై యేళ్ళ క్రింద ఏదో ఊరు వెళ్లుతూ రైల్లో కూర్చున్నాను. రైలు బయలుదేరటానికే చాలా ఆలస్యం ఉంది. కిటికీ దగ్గర కూర్చున్నాను. మొదటిసారి అదే నేను వాళ్లను చూడటం, వాళ్ళు ముగ్గురు కుంటివాళ్ళు, కాలి కుంటికాదు. చేతికుంటి, ఒకనికి ఎడమ చేయి లేదు. కడమ యిద్దరకు కుడిచేతులు లేవు. ముగ్గురూ చొక్కాలు తొడుగుకున్నారు. ఆ చొక్కాలు కుట్టించడంలో గుడ్డయేమీ కలసి రాలేదు. సామాన్యంగా బిచ్చగాళ్ళు రైల్లో ఎక్కి అడుక్కుంటారు. రైళ్ళల్లో వస్తారు. వాళ్లు ముగ్గురూ ఆ ఫ్లాట్‌ఫారం మీదనే అడుక్కుంటారు తప్ప రైలులో రారు, సరిగదా రైలు పెట్టెలోకి గూడా ఎక్కరు.

ముగ్గురూ మంచి పొడగరులు. బలిష్టమైన దేహం గలవారు. ముగ్గిరి ముఖాల్లోనూ మార్దవం గాని యాచ్నాదైన్యం గాని లేదు. పెట్టె దగ్గరకు వస్తారు "అయ్యా! అవిటివాళ్ళం. ధర్మం చెయ్యండి" ఇంతే అడగటం. ఎవ్వరూ మాట్లాడకపోతే వెళ్ళిపోతారు. సామాన్యంగా కుడిచేతి కుంటివాళ్ళే అడుగుతారు. ఎడమచేతి కుంటివాడు మాట్లాడడు. మాట్లాడడంటే యాచన చెయ్యడు.

ఆ మొదటిసారి నేనూ వయసులో ఉన్నానేమో! పైగా క్రొత్తగా యింగ్లీషులో ఉత్తీర్ణుడనైన రోజులేమో – బిచ్చగాళ్ళనే సంస్థ దేశాని కరిష్టమని, వాళ్ళందరూ దొంగలని, యాచన అనేది దేశంలో ఉండకూడదని, యీ మొదలైన భావాలు నాకు అప్పుడున్నవి. నేనన్నానుగదా! "పిడిరాళ్ళల్లే ఉన్నారు. రోగమా? పనిచేసికోలేరా?" అని. పనిచేసుకుందామనే వాడికి పనిదొరకటం కష్టమని ఆ రోజుల్లో నాకేం తెలుసు? నేనీమాట అనటంతోటే ఎడమచేతి కుంటివానికి కోపం వచ్చింది. నావంక క్రోధంగా చూచాడు. రైల్లో తనాయించుకొని పడుకున్న కాబూలీవాడి ముఖం ఎట్లా ఉంటుందో, వాడి ముఖం అల్లా ఉంది. పక్కారౌడీ, మూల దైత్యజాతివాడు వాని మొగం వలె ఉంది. నేనంతటితో ఊరుకొన్నా బాగుండేది. అల్లా చూస్తావేమని దర్జాపోయాను. వాడన్నాడు కదా! "పని చూపించు. చేస్తాను. దొరవు వచ్చావు." అని. ఆ లెక్కల్లో నేను పైమాట యేమనను? హెచ్చితే

తగ్గమన్నారు. అందులో నిజానికి ఆ ఊరు రౌడీ ఊరని ప్రశస్తి. "దొంగలున్నారు జాగ్రత్త" అన్న ప్రకటనలు ఆ స్టేషనులో ఏడెనిమిదైనా ఉన్నవి. ఆ రోజులలో నాకనుమానంగా ఉండేది. ఇంతమంది పోలీసులుంటే ఇంతమంది దొంగలున్నారా, అనీ, పైగా వాని తరహా చూస్తే వాడు బిచ్చగాడల్లే లేడు. ఊరుకున్నాను. నేను పెంచలేదు గనుక వాడూ పెంచలేదు. వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయినారు. కాని నాకు లోపల కోపం ఉందిగా! వాళ్ళు వెళ్ళుతూంటే వాళ్ల వంకే చూస్తున్నాను. కుడిచేయి కుంటివాళ్ళ మందహాసం. వారి నడక, ఎల్లా ఉన్నవంటే నేనొక యీగనో, దోమనో. వాళ్ళు ఉరిమి చూచేటప్పటికి నా పైప్రాణాలు పైన పోయినవి. "హతోస్మి" అన్న శత్రువు వంక ధీరోద్ధతుడైన నాయకుడు ప్రదర్శించిన తిరస్కార సూచకంగా ఉన్నవి. ఎడమచేతి కుంటివాడు నడిచాడు. శత్రుసైన్యాన్ని విదళించి సర్వనాశనం చేసిన మహాసేనాని వలె నడిచాడు. వాళ్ళ శరీర చాలనము, వాళ్ళ ముఖ లక్షణాలు వాళ్ళ నడకలూ చూస్తే వాళ్ళే మహారాజులు, వాళ్ళే ప్రభువులు.

తరువాత చాలాసార్లు వాళ్ళను చూచాను. వాళ్ళు మళ్ళీ వచ్చి నన్నడగటం ఎప్పుడూ తటస్థించలేదు. అట్లా అడిగితే ఏదైనా యిచ్చేవాడిని కూడాను. నామనస్సూ చాలా మారిపోయింది. బిచ్చగాళ్ళేం చేస్తారు? వాళ్ళకేం భూములా బుట్రలా? చదువులా? ఉద్యోగాలా? వాళ్ళను ప్రత్యేకంగా పోషించేందుకు రాజకీయ సంస్థలేమైనా ఉన్నాయా? అది యొక వృత్తి యెందుకు కాగూడదు? ఏం పాపం చెయ్యనక్కరలేని, చెయ్యటానికి వీలులేని ఆ వృత్తే మంచిదేమో? అందులో దైన్యం ఉందంటారు. యాచ్నావృత్తికి దైన్యానికి నిత్యసంబంధం. అధికారం తోడి యాచ్నావృత్తి వెగటు వేస్తుంది. లోకానికి ఉపద్రవం తెస్తుంది. దైన్యంతో కూడి ఉన్న యాచ్నావృత్తి స్వభావసిద్ధమైంది. దానివల్ల ఎవరికీ బాధలేదు. యాచించేవాడి ఆత్మ సాధువైనా కావచ్చు.

నేనెంత మారితేనేమి? వాళ్ళు మారలేదు. నేను వాళ్ళకి గుర్తే. పదేండ్లు గడచినవి. వాళ్ళు నావంకనే చూడరు. వాళ్ళ ప్రభుత్వ సూత్రం అవ్యవహితంగా సాగుతూనే ఉన్నది. దూరాన్నుంచి చాలాసార్లు వాళ్ళ రాచరికం చూచాను. వాళ్ళు ఓడిపోవటం నేను చూడలేదు. భగవంతుడు వాళ్ళయందున్నాడనిపించింది.

వీళ్ళెవరు? వీళ్ళ చరిత్రయేమిటి? కనుక్కుందామని పుట్టింది. కాని వాళ్ళతో మాట్లాడటం ఎల్లాగా? వాళ్ళు ప్రభువులాయె! ఒకరోజున నా అంతట

నేనే వెళ్ళి వాళ్ళకి అణా యిచ్చాను. ఇచ్చానన్న కృతజ్ఞత లేదు. ఒక మెప్పూదలలేదు. ఇవ్వకేం చేస్తాడన్నట్లుగా ఊరుకున్నారు. ఇంతకూ ఊరు మా ఊరు గాదు. ఏదో పనిమీద నేనా ఊరు అనేకసార్లు వెళ్ళక తప్పదు. ఎప్పుడు వెళ్ళినా ప్రొద్దున వెళ్ళటం, సాయంత్రం తిరిగి రావటం. ఒకసారి ఆ ఊళ్ళో నాలుగురోజులుండవలసి వచ్చింది. పని కాలేదు. రేపు ప్రొద్దున-ఆ సాయంత్రం- ఇట్లా ఉన్నాను. ఒకనాడు సాయంత్రం పని యేమీ లేదు గనుక వాళ్ళను గుఱించి వాకబు చెయ్యటం పనిపెట్టుకొన్నాను. “అబ్బాయి! మీరెక్కడ ఉంటారు?” అని అడిగాను. వాళ్ళు నా వంక విచిత్రంగా చూచి తమ దారిని తాము వెళ్ళారు. అది వెన్నెల రాత్రి.

నేను సినిమాకు వెళ్ళి పదిగంటలవేళ తిరిగి వస్తున్నాను. రోడ్డు బాగు చేస్తూంటే ప్రక్క సందులో నుండి పోదామని మళ్ళాను. ఆ సందు నిర్జనంగా వుంది. వెళ్ళేటప్పటికి కొంచెం దూరంలో ముందుగా నలుగురైదుగురు మనుష్యులు కన్పించారు. వాళ్ళ తరహా చూస్తే దెబ్బలాట జరిగి సర్దుకున్నట్లు తోచింది. అక్కడ సందు మలుపు తిరిగింది. సందులో నడిమి భాగంలో యీ కథ. సందు మొదట ఒక రక్షక భటుడు కన్పించాడు. అతడెందుకు జోక్యం కల్పించుకోలేదు? అనిపించింది. కాని వెంటనే సమాధానం తోచింది. ఎవరన్నా పోయి అతనితో ఫిర్యాదు చేస్తే గదా! ఫిర్యాదు లేకుండా రాచరికం జోక్యం కల్పించుకోదు. నాకు కొంచెం భయం వేసింది. ఈ అపరాత్రి వేళ యీ సందులోకి వచ్చామేమా అని. కాని మొండి ధైర్యంతో ముందుకు నడిచాను. మరీ యేమైనా జరిగితే రక్షకభటునితో పోయి చెప్పవచ్చునని. నేనందాకా వెళ్లేటప్పటికి వాకిట్లో ఉన్న యిద్దరు ముగ్గురు మనుష్యులూ లోపలికి వెళ్ళారు. లోపలినుంచి ఒక క్రొత్త మనిషి వచ్చి వాకిట్లో నిలుచున్నాడు. బాగా దగ్గరకు వెళ్ళేటప్పటికి ఆ మనిషి యెవ్వరో నాకు తెలిసింది. ఆ ముగ్గురు బిచ్చగాళ్ళల్లో ఒకడు. కుడిచేతి కుంటివాళ్ళల్లో ఒకడు. వాళ్ళతో నాకు పదేళ్ళకు మించిన పరిచయ మాయెను. వాళ్ళతో మాట్లాడవలెనని కోరికాయెను. నా దారిని నేను మాట్లాడకుండా పోదామనుకున్నవాణ్ణి అతనిని పలుకరించాను. “నీవిక్కడుంటావా?” అని. అతడు “ఊ” అన్నాడు. అది పెద్ద అనుగ్రహం. ఊ అన్నాడే గాని ఎక్కువ మాట్లాడిస్తే మాట్లాడే ధోరణిలో లేడు. నేనూ మర్యాదగా వెళ్ళిపోయాను.

మఱునాడు రాత్రి పనిగట్టుకొని మళ్ళీ అక్కడకు వెళ్ళాను. సందులో ఎవ్వరూ లేరు. సందు మొదట రక్షకభటుడు లేడు. ఆ తలుపు మాత్రం తెరచి వుంది. సాహసించి లోపలికి పోనా వద్దా? తటపటాయిస్తూ సందు చివరిదాకా వెళ్ళినవాడిని జారునివలె వెనుకకు తిరిగివచ్చాను. నేను వెనుకకు తిరిగిరావటం అతడు కనిపెట్టాడు కాబోలు. బయటకు వచ్చి "ఏమిటి నాతో పని?" అన్నాడు.

నేనేమి చెప్పను? నేను చెప్పిన మాటల్లో నిజమతనికేం తెలుస్తుంది? అయినా చెప్పక యేం చెయ్యాలి? కాబట్టి చెప్పక తప్పదు. "అబ్బాయి! నేను కవిని. నాటకాలు, నవలలు, కథలు వ్రాస్తూ ఉంటాను. మిమ్మల్ని పన్నెండు పదమూడేండ్ల నుండి చూస్తున్నాను. మీ వంటి వాళ్ళ కథలు మేము వ్రాస్తే మేము చాలా గొప్పవాళ్ళమని దేశం అనుకొంటారు. నీ సంగతి కనుక్కుందామని వచ్చాను." అని చెప్పాను. అతడు నా మాటలు నమ్మినట్లుందిగాని తెలియనట్లు లేదు. అతడా వెన్నెలలోనే నా వంక తీక్షణంగా చూచాడు. ఒక నిముషం అయిన తర్వాత "రేపు రాత్రికి రా" అన్నాడు. రండీ లేదు. పాడూ లేదు. ఏం అంత అమర్యాదగా మాట్లాడుతావని వాడితో తగాదా పెట్టుకోనా! పైగా అతని కోసం నేను వెళ్ళాను తప్ప నాకోసం అతడు రాలేదు గదా. నేను అతణ్ణి 'నువ్వు' అంటే అతడు నన్ను "ఏమండీ" అని యెందుకనాలి? మనుష్యులలో ఎక్కువ తక్కువ లేమున్నవి? అని భావం మళ్ళించుకొని నా దారిన నేను వచ్చేశాను. కాని నేను కొంతదూరం నడిచిన తర్వాత నా వెంట యెవరో వస్తున్నట్లుగా అలికిడి తోచింది. ఆ మనిషి కొంతదూరములో నా పోయినంత మేరా వచ్చాడు. నేను బస దగ్గర నిలబడ్డాను. అతడు తన దారిని తాను పోయినట్లుగా నా ముందరగానే నడచివెళ్ళాడు. ఇదేమిరా క్రొత్త తద్దినం కొని తెచ్చి పెట్టి కొన్నాననిపించింది. కొంతసేపు నిద్రపట్టలేదు.

మఱునాడు రెండు మూడు విచిత్రములైన అనుభవాలు జరిగినవి. ఒకళ్ళిద్దరు నా వంక పరకాయించి చూడటం; ఆరోజు సాయంత్రం ఆ ఊళ్ళో పఠనాలయంలో నేను కూర్చొని ఒకళ్ళిద్దరు స్నేహితులతో మాట్లాడుతుంటే ఒక బిచ్చగాడల్లే కనబడేవాడు నా ఆచూకీ కనుక్కోవటానికి ప్రయత్నిస్తున్నట్లుగా తోచింది. ఆ సమయంలో ఆ స్నేహితులిద్దరు నేను వ్రాసిన ఒక కథ చాలా

బాగుందని మెచ్చుకుంటున్నారు. మతే అదృష్టం-అని తర్వాత తెలిసింది. ఆ కథ బిచ్చగాళ్ళని గుఱించి వ్రాసిందే.

రాత్రికి అతని దగ్గఱకు వెళ్ళాలా? అక్కఱలేదా? ఒక భయం లోపల ఉన్నది. ఆ భయం ఇదమిత్థమని చెప్పలేను. ఒక ధైర్యమూ ఉన్నది. ఒక ధైర్యమూ ఉన్నది. వాడేమో బిచ్చగాడాయెను. వానిని గుఱించి యింత తర్జన భర్జన యెందుకని అనుకొంటాను. చివరకు వెళ్ళాను. గడచిన రెండు రోజులు ఆవాకిటి ముందు గలీజుగా ఉంది. నేను వెళ్ళేటప్పటికి ఊడిచి నీళ్ళు చల్లినట్లుంది. నేను ద్వారంలో నుంచున్నాను. గడచిన రెండు రాత్రులుగా లేని దీపం ఒకటి లోపల వెలుగుతున్నది. ఒకచాప వేసి వున్నది. అతడు లోపల కూర్చుండి 'రండి' అన్నాడు. అంతమట్టుకు నయమే. 'రా' పోయి 'రండి' అయింది. వెళ్ళాను. కూర్చున్నాను.

"నీ పేరేమిటి?"

'బుంగన్న'

'నీకు సంసారం లేదా?'

"ఇదే సంసారం"

'రోజుకే మాత్రం సంపాదిస్తావు?'

'సంపాదనే మున్నదండి బాబూ! మీవంటి దొరలు పనిచేసుకోరాదా? అంటారు. కాని తోచినప్పుడణాలిస్తారు గదా?' నవ్వాడు. అతనికి చమత్కారం కూడా తెలుసు.

మళ్ళీ నేనన్నాను. "మొన్న ఇక్కడేదో అల్లరిగా ఉందేమిటి?"

అతడు సమాధానంగా చెప్పాడు. "మీరు నిజంగా కథలు వ్రాసేవాళ్ళే. కనుక్కొన్నాను.'

"నేనూ అనుమానపడ్డాను. ఎందుకు నామీద రహస్య భటులను ప్రయోగించావు?"

"మా మీద రహస్యభటులుంటారు. మీరందులో ఒకళ్ళేమోనని అనుమానంతో"

"ఛీ!ఛీ! నేనదేమీ కాదు. నిజంగా మీ సంగతి కనుక్కొందామనే అడిగాను. పూర్వం నాకు బిచ్చగాళ్లంటే చాలా అసహ్యంగా ఉండేది. ఏ కలెక్టరో అవుతానని

అనుకునేవాణ్ణి. అది అనుకుంటూ కారణం. ఇప్పుడదేమీ కాదని తెలిసింది. బిచ్చగాళ్ళంటే నాకేమీ ద్వేషం లేదు. పైగా మిమ్మల్ని గుఱించి కథలూ అవీ వ్రాసి తృణమో పణమో సంపాదించుకొంటున్నాను."

అతను నవ్వుతూ "మాపేరు చెప్పి సంపాదించుకుంటారు గానీ మాకేమీ యివ్వ"రన్నాడు.

"ఈసారి వచ్చే డబ్బులో కొంత నీకిస్తాను" అని అన్నాను.

అతడు ఉదారంగా "అక్కరలేదు లెండి. మీరూ పేదవాళ్ళే అయి ఉంటారు. నాది ఒక్కపొట్ట. తేలిగ్గా రోజుకి నాలుగైదు రూపాయలు అన్ని మినహాయింపులూ పోను నా వాటా వస్తుంది" అన్నాడు.

**నేను** - మినహాయింపు లేమిటి?

**అతడు** - అలా ఉంది లెండి

**నేను** - దానికోసమేగా నేను వచ్చింది.

**అతడు** - నేనన్నీ చెప్పటానికి వీలులేదు. మానాయకుణ్ణి కనుక్కొంటేనే గాని చెప్పటానికి వీలులేదు.

**నేను** - మఱి యెప్పుడు రమ్మంటావు?

**అతడు** - పదిరోజులు పోయిన తర్వాత రండి

**నేను** - మీ నాయకుడంటే యెవరు? ఆ యెడమచేతి కుంటివాడా?

**అతడు** - ఔనన్నాడు.

నేనన్నానుగదా 'ఆ సంగతి తర్వాత చెప్పవచ్చు - నీ పూర్వ చరిత్ర చెప్పవచ్చు గదా" అన్నాను.

**అతడు** - అదీ అప్పుడే చెప్తుతాను. నాయకుడి అనుమతి లేకుండా అది చెప్పకూడదు. నేను మీ పక్షం మాట్లాడి అతడిని ఒప్పిస్తాను. మీరు నిజంగా వట్టి కవేనా?

**నేను** - ఒట్టు. కావలిస్తే చేతిలో చేయి వేస్తాను.

**అతడు** - "ఎడమ చేయి పనికి వస్తుందా?" అని నవ్వాడు.

నాకాశ్చర్యం వేసింది. అతని చమత్కారం, అతని హాస్యం, అతని నాగరికత. అతడు బిచ్చగాడేమిటి?!

మఱునాడు రైల్వేస్టేషనులో మళ్ళీ ముగ్గురు కన్పించారు. ఆ నాయకుడు నా వంక చుఱుకుగా నిదానంగా చూచాడు. ఎదుటివాని సర్వమూ ఆకట్టేందుకు ఒక మహామంత్రి అట్లా చూస్తాడేమో? ఒక మహానాయకుడు అట్లా చూస్తాడేమో?

**(2)**

పదిరోజులైన తర్వాత వెళ్ళాను. రైలు దగ్గరే వాళ్ళు కన్పడ్డారు. కాని వాళ్ళు ముందరెక్కడో ఉన్నారు.రాత్రికి రావచ్చునా? అని అడగటానికి యెట్లా వీలు? తీరా రాత్రికి వెళ్ళితే మర్నాడు రమ్మంటాడేమో? ఇంకొకరోజు కూడా ఆ ఊళ్ళోనే ఉండవలసి వస్తుంది.

అది వెన్నెలరాత్రి. కాదు ఆ సందు భద్రమైన సందూ కాదు. సరే, సినిమా ఉంది కదా తోడు. రాత్రి పదింటికి వెళ్ళాను. మళ్ళీ సందు మొదట రక్షకభటుడు. అతని యింటి ముందు నలుగురైదుగురు మనుష్యులు క్రొత్తమనిషి వస్తున్నాడని వాళ్ళు ఆకట్టారు. ఈ సారి చీకటి యొక్క ఆసరా చూచుకొని కాబోలు లోపలికి పోలేదు. నేనింతమంది ఉండగా మాట్లాడటం యెందుకని వెళ్ళిపోదామనుకొన్నాను. ఆ మనుష్యులెట్లాంటి మనుష్యులో నాకు తెలియదు. నేనొంటరిగా నున్నాను కదా అని వాళ్ళు నామీద ఏదైనా అత్యాచారం చేయవస్తే యేం చేయాలి? అతని పేరు నాకు తెలసును. అందుచేత ఒక చిన్న ప్రయోగం చేశాను. అక్కడికి వెళ్ళి నిలుచుని “బుంగన్న ఉన్నాడా?” అని అడిగాను. వాళ్ళు నలుగురూ నావంక చిత్ర చిత్రంగా చూచారు. చీకట్లో చూచారనడం యెట్లా? మరి చూడలేదనటం యెట్లా? చూచారన్నది స్ఫురిస్తున్నది. ప్రత్యక్షంగా వాళ్ళ కళ్ళ కాంతులు కన్పించకపోయినా.

వాళ్ళు మాట్లాడలేదు. నేను వెళ్ళిపోతున్నాను. ఆ పేరు మోహనమంత్రంగా నన్ను వాళ్ళు వెళ్ళనిచ్చారనిపించింది. నేను సందు మలుపు తిరిగిన తర్వాత ఒక మనిషి వచ్చి బుంగన్న నిన్ను రమ్మంటున్నాడన్నాడు. నేను వెనక్కి తిరిగి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి అక్కడ ఒక్క మనిషీ లేదు. ఇంతట్లో నలుగురూ ఏమైనారు? సందుయొక్క ఆ చివర రక్షకభటుడు కాబోలు నిలుచున్నాడు.

నేను లోపలికి వెళ్ళాను. బుంగన్న రమ్మన్నాడు. చాప వేశాడు. దీపం వెలిగించాడు. చాపవేస్తూ అన్నాడు గదా మీరు వస్తారని తెలియదు అని.

"ఇందాక మీరు దూరంగా కన్పించారయ్యా! చెపుదామంటే అందలేదు" అన్నాను.

**అతడు** – "ఎప్పుడూ నాతో ముందర చెప్పి రావాలి. లేకపోతే యెవళ్ళో ఒకళ్ళుంటారు."

"ఎవళ్ళువాళ్ళు" అన్న ప్రశ్న నోటిదాకా వచ్చింది. అడగవచ్చునో, అడుగరాదో? ఆ ప్రశ్న ఆపుకొని "మీ నాయకుణ్ణి అడిగావా?" అన్నాను.

**బుంగన్న** – అడిగాను. కాని మీరు వ్రాసేది మాకు వినిపించి పత్రికల్లో వేయించాలి.

**నేను** – ఊర్ల పేర్లేనయ్యా!

**అతడు** – పేర్లు మారిస్తే?

**నేను** – కథ కథగా ఉంటుంది. గుర్తుపట్టలేరు.

**అతడు** – కథను బట్టి గుర్తు పట్టలేరా?

**నేను** – పాండవులూ, ద్రౌపది అజ్ఞాతవాసంలో పేర్లు మార్చుకొన్నారు. ఇంచుమించుగా కథ కథగానే చెప్పారు. ఏం గుర్తుపట్టారు?

అతను నవ్వాడు. ఎందుకు నవ్వుతున్నావన్నాను.

"మమ్మల్ని ఏం గుర్తుపట్టారు! అట్లాగే" అన్నాడు

**నేను** – మీ రెవ్వరో తెలియదాయె. యెల్లా గుర్తుపట్టడం?

**అతడు** – అదికాదు బాబూ! సరేకాని మా నాయకుడు మీతో నా కథ చెప్పవచ్చన్నాడు.

**నేను** – నాకు "నీ ఒక్క కథే కాదు. నీ ముగ్గురి కథా కావాలి" అన్నాను.

**అతడు** – "మా నాయకుడు మొదట ఒప్పుకోలేదు. నేను ఒప్పించాను. సింగన్నా! ఇందులో యేముందన్నాను. అతడన్నాడు కదా. పోనీలే పదిరాళ్లు తెచ్చుకుని బ్రతుకుతున్నాడు కాబోలన్నాడు."

నాకు కష్టం వేసింది. అరే, వీళ్ళకు దయనీయుణ్ణి అయినానే నేను అని. మఱి అన్నాను "అతనిపేరు సింగన్నా?" అని... అతడు - "నా కథ చెప్పమంటారా?" అని. వెంటనే కథ చెప్పడం ఆరంభించాడు.

"నేనూ, సింగన్నా ఒకటే జాతివాళ్ళం. ఎప్పుడో మావాళ్ళు దూరదేశం వలసపోయారు. కాని వాళ్ళూ మేమూ సంబంధాలు త్రెంచుకోలేదు. ఆ వలసదేశంలో మావాళ్ళు చాలా సంపాదించారు. అని బుంగన్న చాలా పెద్ద పెద్ద పేర్లు చెప్పాడు. నేనట్టాంటి కులంలో పుట్టాను. కాని, నా జాతకం యిలా ఉంది. నేను చిన్నప్పుడు చదువుకొన్నాను. అల్లరిచిల్లరిగా తిరిగాను. బోలెడంత డబ్బుంది. నాకు చదువెందుకు? పైగా మావాళ్ళలో చాలామంది చదివారు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. కాని నేను చాలా ఘోరాలు చేశాను. అవన్నీ యిప్పుడెందుకు? అయిదాఱుసార్లు ఖైదులోకి వెళ్ళవలసివచ్చింది. డబ్బు సమృద్ధిగా ఉంది గనుక ఖైదు తప్పిపోయింది. ఇదంతా నాకు ఇరవైయేళ్ళు రాకముందే. ఆ పాటున ఉండిపోతే బాగానే ఉండేది. కాని మనస్సు నిలవలేదు. దేశం చూడాలనిపించింది. చాలా చోట్లు తిరిగాను. ఒకసారి రైల్లో వెళ్ళుతుంటే ఆ రైలుకు ప్రమాదం సంభవించింది. ఆ ప్రమాదంలో నా కుడిచేయి విఱిగిపోయింది. అదేదో ఆసుపత్రిలో ఉన్నాను. నెల్లాళ్లు నా స్మృతి నాకు తెలియదు. నేనెవరో నాకు గుర్తు తెలియదు. ఒక యేడాది బిచ్చగాళ్లల్లో చేరాను. తర్వాత స్మృతి వచ్చింది. మా ఊరు వెళ్ళాను అక్కడ మా ఆస్తి అంతా పోయింది. చాపచెడ్డా చదరంత కాదా? అక్కడుంటే కూటికీ గుడ్డకీ లోపం లేకుండా జరిగేదే కాని, బిచ్చమెత్తటం సుఖమనిపించింది.

**నేను** - "ఇది ఆశ్చర్యంగా ఉంది. బిచ్చమెత్తటమేమిటి?సుఖమేమిటి?"

**అతడు** - "ఆ సంగతి నీకు తెలియదులే బాబూ! ఇందులో చాలా సుఖమున్నది. చీకూ చింతా లేదు. ఒకణ్ణి లెక్కపెట్టవలసిన అవసరంలేదు."

**నేను** - అట్లా అంటావేమిటి బుంగన్నా! గడపగడపా యెక్కాలి. దేబిరించాలి. వాళ్ళు విసిరికొట్టే పడి ఉండాలి. ఒక్కొక్కప్పుడు తిడ్తారు. మళ్ళీ తిట్టటానికి కూడా వీల్లేదు"

**అతడు** – "ఇదంతా సుఖం కాదంటారా? ఒక్కవిషయం ఆలోచించండి. ఓట్లకోసం తిరిగే మీ నాయకులందరూ ఏం చేస్తున్నారు? దానికీ దీనికీ యేమైనా భేదం ఉందా? ఆలోచించండి.

నేను నిస్తబ్ధుడనైనాను. నాకేమీ సమాధానం కనిపించలేదు. అతను మళ్ళా అందుకున్నాడు. "భాబూ! సుఖమనేది అప్పుడు కాదు. అది అయిన తర్వాత. గృహస్థు విసుక్కున్నా, విదళించినా, తిట్టినా, ఆ సమయములో అతడెంత గొప్పవాడనుకొంటాడో బిచ్చగాడూ అంత గొప్పవాణ్ణి అనే అనుకొంటాడు. వెయ్యిమందిలో వందమంది యిస్తే చాలు. అదంతా యెందుకు? దేశంలో యింతమంది బిచ్చమెత్తుతున్నారు. ఎవళ్ల దగ్గరకైనా సరే పోయి, ఒరేయ్ మా యింట్లో పనిచేసేందుకు ఉందువుగాని రా, అన్నం పెట్టి నెలకు పాతిక రూపాయలిస్తానని ఒప్పించు. ఒక్కడొప్పుకోడు. వాడు బిచ్చమెత్తుతూ బిచ్చమెత్తుతున్నాననే అనుకోడు. ప్రతివాడూ తనపని తను చేస్తూ అది గొప్పగానే ఉందనుకొంటాడు గాని కొద్దిగా ఉందనుకోడు. ఇప్పుడు ఓట్లు అడిగేవాళ్ళని చూడండి. ఛీ! వీళ్లని పోయి అడగటం ఏమిట్రా? అని అనుకొంటారా? తరువాత రాజ్యం చేయవచ్చు అనే దిలాసాలో ఆ నీచత్వం కన్పించదు. పైగా ఆ ఉద్దేశ్యంతో ఉన్నప్పుడు ఇది కూడా మర్యాద గల పనే అవుతుంది."

**నేనన్నాను** – "తరువాత వాళ్ళు నిజంగా రాజ్యం చేస్తున్నారు. మీరేం చేస్తున్నారు?"

**అతడు** – "వాళ్ళు రాజ్యం చేస్తున్నారని అంటారా? మాకేమి నష్టం? ఇంటికి వచ్చిన తరువాత మమ్మల్ని అడిగేవాడు లేడు. మాయిష్టం వచ్చినట్లుండగలం. మాకు బాదరబందీ లేమీ లేవు. వాళ్ల కట్లా కాదు గదా!"

"అవును లేవోయి బుంగన్నా! అంతా మనస్సులో ఉంది. ఏది బాగుందనుకొంటే అదే బాగుంటుంది. మఱి వాళ్ళకేం బోలెడంత సంపాదిస్తారు. చేతిలో అధికారం ఉన్నది. వాళ్ళ యిష్టం వచ్చినవాళ్లకి నచ్చినవాళ్ళకి మేలు చేస్తారు. ఇష్టం లేని వాళ్ళని అణగద్రొక్కుతారు."

**బుంగన్న** – "కొద్దిలో ప్రపంచం రహస్యం అంతా చెప్పారు"

నేను అతని తెలివితేటలకాశ్చర్యం పోయాను. "ఇతను బిచ్చగాడేమిటి?" అనుకొన్నాను. అయినా అతడు పూర్వం మంచిరోజు లెటిగినవాడు. లోకానుభవం గలవాడు. అందరు బిచ్చగాళ్ళూ ఇలా ఉంటారా? మళ్ళీ ప్రశ్నవేశాను. "లోకమంతా అంతేనందాం. అది వాళ్ళకున్నది. మీకు లేదు కదా?" అని. బుంగన్న అన్నాడు గదా ఏమిటి మాకు డబ్బులేదనా? మాకు డబ్బున్నది. లేదనుకోటం పొరపాటు. మీలో యెన్ని భేదాలున్నవో మాలో అన్ని భేదాలున్నవి. బిచ్చగాళ్ళలో తిండికి లేని వాళ్ళున్నారు. మీలోనూ తిండికి లేనివాళ్లున్నారు. మాలో ధనవంతులున్నారు. మీలో ధనవంతులున్నారు. మీదొక ప్రపంచకం. మాదొక ప్రపంచకం. మిమ్మల్ని గుఱించి మాకు తెలుసు. మమ్మల్ని గుఱించి మీకు తెలియదు.

కథ అవసానమైపోయి ఇంక వెళ్ళిపోవాల్సిందే అనుకొన్నాను. కాని వెళ్ళటానికిష్టం లేదు. ఇంకా యేదో తెలుసుకోవాలని మళ్ళీ ప్రశ్నించాను. "నీదగ్గర యేమాత్రం డబ్బున్నది." బుంగన్న – "నాకు డబ్బెందుకు ? కావలిస్తే నాకు లోపం లేదు. వెనుకటిదఫా చెప్పాను కదా! అన్ని మినహాయింపులూ పోతే రోజు కాఱు రూపాయలన్నా నాకు మిగులుతాయని, మిగులుతవి. అంటే అందులో దమ్మిడీ నేను ముట్టుకోనక్కఱలేదు. సంవత్సరానికి రెండువేలు. నాది నికరాదాయం. నీవు నమ్మవేమో గాని నా సొంతడబ్బు పాతికవేలుంది. దాంతో నాకేం గావాలి? ఎప్పుడో ఒకప్పుడు సంఘానికుపయోగపడేదే."

నాకు మళ్లీ రెండు ప్రశ్నలు దొరికినవి. మినహాయింపు లేమిటి? సంఘం ఏమిటి? అతడు మొదటి ప్రశ్న కిలా సమాధానం చెప్పాడు. "ఇది నీతో చెప్పవచ్చునో చెప్పకూడదో! నాకు తెలియదు. చెప్పానని తెలిస్తే సింగన్న యేమంటాడో తెలియదు. బిచ్చగాడు ఎవడైనా సరే సంఘానికి తహాస్సీలు కట్టాలి. కొందరికి జబ్బుచేస్తే పోషించాలి. మాలో కొందరు ఖైదులోకి వెళ్తూ ఉంటారు. వాళ్ళ కుటుంబాల్ని పోషించాలి. అధికార్లకి మమూళ్ళుంటవి. రక్షకభటులకు మామూళ్ళుంటవి. ఇందులో ఎవడికో పెళ్ళి అయితే వాడి ఖర్చు సాగించాలి. ఇట్లా చాలా పనులుంటవి. ప్రతివాడూ సంపాదనలో ఆఱోభాగం వీటిక్రింద యివ్వాలి. తక్కిందే వాడుపయోగించుకోవాలి."

**నేను** – "మీదంతా చూస్తే ఓ పెద్ద సంస్థవలె ఉంది. మఱి కొందరు బిచ్చగాళ్ళు చాలా యిబ్బంది పడుతూ ఉంటారే."

**బుంగన్న** – "ఎవళ్ళు ఇబ్బందిపడతారు? సంఘంలో చేరని వాళ్ళిబ్బంది పడతారు. మీలోనే చూడండి. ఒకపార్టీ వాళ్ళు రాజ్యం చేస్తుంటే ఆ పార్టీ వాళ్ళకేమి యిబ్బంది ఉంది? ఆ పార్టీలో చేరనివాళ్ల కిబ్బంది. కొందరెక్కువ సంపాదిస్తామనుకొని మాలో చేరరు. వాళ్ల కష్టాలు వాళ్లనుభవిస్తుంటారు.

**నేను** – ఈ డబ్బంతా యెవళ్ళు వసూలు చేస్తుంటారు?

**బుంగన్న** – "మాలో అధికారులున్నారు. ఇందాక మీరు వచ్చినప్పుడిక్కడ నలుగురున్నారు గదా. వెనుకటి దఫా మొదటిసారి వచ్చినప్పుడు కొందరున్నారు. వీళ్ళందరూ డబ్బు వసూలు చేసేవాళ్లే. ఇందులో కొంతడబ్బు మింగేస్తుంటారు. వాళ్ళను శిక్షించటం మొదలైన పనులుంటవి. ఇదంతా ఒక రాజ్యం".

**నేను** – నీవు పెద్ద ఉగ్యోగస్థుడవన్నమాట

**బుంగన్న** – నేను, రంగన్న అంటే మాలో మూడోవాడు. మేమిద్దరం మంత్రులం. సిగన్న రాజు. ఈ జిల్లాలమీద సింగన్న తానే సొంతంగా చూచుకొంటాడు. సింగన్న యీ మూడు జిల్లాలకూ రాజు. ఈ మూడు జిల్లాలు ఒక పరగణా, నేనూ రంగన్న మఱి రెండు జిల్లాలు చూస్తాం."

**నేను** – మఱి ప్రపంచకములో యీ మూడు జిల్లాలేనా ఉన్నవి?

**బుంగన్న** – అన్ని జిల్లాలకూ అధికారులున్నారు. అన్ని పరిగణాల అధికారులూ ఏడాది కొకసారి, రెండేండ్ల కొకసారి కలుసుకొంటారు. మాది న్యాయమైన రాజ్యం. అన్యాయాలెక్కువ చెయ్యం. మాకు సేన లక్కఱలేదు. తుపాకు లక్కఱలేదు. మాది ఒక శాంతిరాజ్యం.

**నేను** –బుంగన్నా! నాకు నవ్వువస్తోంది. లోకమంతా మీరే యేలుతున్నట్లు మాట్లాడుతున్నావు. మా మంత్రులు, మా రాష్ట్రప్రజలు, మాశానససభ్యులు, మా సేనాపతులు, వీళ్ళందరిమాట యేమి చెప్పావు?

బుంగన్న కథ మార్చాడు. ఇట్లా అన్నాడు: "ఇంతకూ మీ కథకు తగినంత విషయం దొరికింది కదా! మీరు కథ వ్రాసుకోండి. ఇంక మాగోల మీకెందుకు?"

**నేను** – నన్ను తీసుకుపోయి నట్టేట్లో దిగవిడుస్తున్నావు. సరిగా తెలిసికోవలసిన విషయం దగ్గరకు వచ్చేటప్పటికి ముగించి వెళ్ళమంటున్నావు.

నా కథకి ముక్కు మొగం ఏర్పడ్డది. కాళ్ళు తెలియటం లేదు. ఎట్లా నడవాలో తెలియదు.

**బుంగన్న** – మా రంగన్న కీ సంగతి బాగా తెలుసు. అతను బాగా చదువుకొన్నవాడు. అతనిని పోయి కలుసుకొంటే మీరు మీ కథ యెట్లా నడపాలో చెప్తాడు. అతడు పెద్ద కవి. మా బిచ్చగాళ్ళు పాడే పాటల్లో సగం పాటలు అతడు వ్రాసినవే. అతడు బాగా పాడుతాడు. కిన్నెరమీద అతడు వాయిస్తూ ఉంటే సభ సభంతా విస్తుపోయి చూస్తుంటారు.

**నేను** – నే తేపుండడానికి వీల్లేదు. మళ్ళీ యెప్పుడైనా వస్తాను. నన్నతని దగ్గరకు తీసుకొని వెళ్ళుతావా?

**బుంగన్న** – ఇంకా నాలుగురోజుల్లో శివరాత్రి వస్తోంది. ప్రతి శివరాత్రి నాడు అతడా కాలువ ఉందే – ఆ కాలువ ప్రక్కన గుడిసెలు లేవా? అక్కడ కూర్చుని పాడుతాడు. ఆరోజున రండి!

**(3)**

ఆ సంగతి నేను మఱచిపోయినాను. శివరాత్రినాడు ఆ ఊరే వెళ్ళే వాణ్ణి కాదు. సాయంత్రం పూట ఒక స్నేహితుడు తనపని యేదో చూచిపెట్టమని ఆ ఊరికి తఱిమాడు. ఆ పనిలో ఉండి నేనీ విషయమే మఱచిపోయినాను.

రాత్రి పది అయింది. చీకటి. ఇంకా చంద్రోదయం కాలేదు. అయ్యే లక్షణాలు తూర్పున కన్పిస్తున్నవి. నేను రోడ్డు వెంట ప్రాఙ్ముఖంగా నడుస్తుంటే సన్నని తెల్లనికాంతులు, చల్లని మెల్లని గాడ్పులు, సన్నని ప్రన్నని మధురసంగీత నినాదాలు ఒక్కసారి వచ్చి నన్ను కొట్టినవి. ఒక్కసారి మనస్సులో సర్వమూ ప్రకాశించింది. ఈ మనసు చిత్కలా ప్రకాశం. వెంటనే ఒక్క వంద విషయాలు హఠాత్తుగా స్ఫురిస్తవి. అందుకనే ఒక దశలో మనస్సే బ్రహ్మ అని తెలుసుకోవాలన్నాడు.

ఈ సంగీతం ఎక్కడిది? కాలువ ఒడ్డునుంచి వస్తున్నది. రంగన్న సంగీతం పాడుతున్నాడని వెంటనే తెలిసింది. కొంత దగ్గరకు పోయినాను. కొన్ని వందలమంది అతని చుట్టూ కూర్చుని యున్నారు. అనేకమంది రోడ్డుమీదనే నిలచిపోయి వింటున్నారు. ఒకతను నాతో అన్నాడు. “అతను కుంటివాడండి.

కుడిచేయి లేదు. మెడ క్రిందపెట్టి కుడికాలితో కిన్నెర అదుముతాడు. ఎడమచేతితో తంత్రులు మీటుతాడు. ఈ కుడికాలి బొటనవ్రేలితో కంజిరా మ్రోగిస్తాడు" అని

కంచికామాక్షి మీద పాడుతున్నాడు ఒక కీర్తన. దాని మాధుర్యం. ఆ స్వరసమ్మేళన చెప్పటానిక కలవికాదు. ఇప్పుడు ప్రసక్తీ కాదు.

రాత్రి పదకొండు దాటిపోయింది. ఎవరిదారిని వాళ్ళు వెళ్ళిపోయినారు. నేనక్కడే నిలుచున్నాను. రంగన్న యిల్లెక్కడ? రాత్రి పన్నెండయిన తర్వాత రంగన్న ఒక్కడూ బయలుదేరి పోతున్నాడు. నేనతని వెంటనే వెళ్ళాను. అతని యిల్లు చేరేవఱకు నేనతని వెంట వెళ్ళుతున్నానని అతనికి తెలియదు. తీరా యింట ముంగిట నన్ను చూశాడు. ఎవరో అనుకున్నాడు. అనుకోటంలో అనుమానపడ్డాడు. మళ్ళీ తిరిగి చూచాడు. "నేనేనయ్యా!" అన్నాను. లోపలికి పోయి కూర్చున్నాం. "రంగన్నా! నీవు మనుష్యుడవు కావు. అవతారపురుషుడవు. ఆ సంగీతమేమిటి? నీ గొంతు మాధుర్యమేమిటి? నీ వాద్యమేమిటి? నీ పాదాలకి నమస్కారం చేస్తే పాపాలు పోతవి" అన్నాను. అయ్యోయ్యో! అదేమిటి బాబూ! ఎంతమాటెంతమాట! ఏదో చిన్నప్పుడు నేర్చుకున్నాను. అరవదేశంలో చాలా రోజులు తిరిగాను. కుడిచేయి లేదు కనుక ఎడమచేతితోనే అలవాటు చేసికొన్నాను. మీరు గొప్పవారట. కవులట. సంగీతం పాడితే నేనవతారపురుషుడనయితే కవిత్వం వ్రాస్తే మీరూ అవతారపురుషులే గదా' అన్నాడు.

మాటకీ మనస్సుకీ ఉన్న సంబంధమే అతి చమత్కారంగా ఉంటుంది. అతను ఆ మాట అనడంతోటే నేను సంగీత లోకంలోనుంచి బయటకు వచ్చాను. అక్కడికి నేనెందుకు వచ్చానో స్మృతికి వచ్చింది.

అతను వెంటనే అన్నాడు. "మీకు నా సంగతి చెప్పాలిగదా? మీకు ప్రొద్దు పోతుందేమో? మాకేముంది? ఎన్ని రాత్రిళ్ళయినా మేల్కొని ఉంటాం. ఈ సంగీతమండీ బాబూ! అనేక రకాలు. మా బిచ్చగాళ్ళ సంగీతాలు వేఱు. మీ బాణి వేఱు. మా బాణీలలో ఉన్న తీపి, కచ్చేరిలు చేసే బాణీలలో ఉండదు. దానికాలోచన యెక్కువ కావాలి. శాస్త్రం యెక్కువ తెలిసి ఉండాలి. మా బాణీలో పాట యొక్క ఫణితి, కంఠమాధుర్యం ప్రధానంగా ఉంటవి. సామాన్య జనం దీనికి చప్పున లొంగిపోతారు. మాది యీ దేశం కాదు, పడమటి దేశం.

మా వాళ్ళెప్పుడో వచ్చారు. నా తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. బుంగన్నవలె నేను గొప్ప యింట పుట్టలేదు. సింగన్నవలె పుట్టానని చెప్పుకోను. ఇప్పటికీ నాకు కొద్దిగా జ్ఞాపకమే. మిఠాయి దుకాణాల ప్రక్కన నిలుచుండి, కొనుక్కొని తినేవాళ్ళ దగ్గర చేయి చాపేవాణ్ణి. కొందరు పెట్టేవాళ్ళు. కొందరు కన్నెఱ్ఱ చేసేవాళ్ళు, అప్పుడప్పుడు దెబ్బలు కూడా తగిలేవి. బాబూ! అంతా చిత్రమే. అల్లాంటి నేను ఎల్లా బ్రతికానో నాకే ఆశ్చర్యంగా ఉంటుంది. నా చేత దొంగతనాలు చేయించటానికి కొందరు ప్రయత్నించారు. నేను లొంగలేదు. పెద్దయైన తర్వాత తెలిసింది. లోకమంతా దొంగతనమేనని.

**నేను** - అయితే "దొంగతనం చెయ్యవచ్చునన్నమాట. ఇప్పుడు చేస్తున్నావా?"

**అతడు** - చేయకపోతే రాజ్యం చేయటం ఎట్లాబాబూ! రాజ్యం చేసేవాడంటే మొదట బిచ్చగాడు. తరువాత దొంగ.

**నేను** - నీవు రాజువంటావా యేమిటి?

**అతడు** - రాజైతే రెండుచేతులూ ఉండాలా? రెండుచేతులతోనూ పోగు చేసేది ఒక్కచేతితో యెందుకు చేయరాదు? చేతనై యుండాలి గాని. నాకు పదహారు పదిహేడేళ్ళు వచ్చేవఱకు ఏం జరిగిందో? ఎట్లా బ్రతికానో? పూసగ్రుచ్చినట్లు చెప్పలేను. కొన్నాళ్ళు కూలికి వెళ్ళాను. గోడలు కట్టేవాళ్ళతో చిన్న చిన్న పనులకూ తిరిగాను. అదేమీ గిట్టింపు కాలేదు. ఎప్పుడు కూలి లేకపోతే అప్పుడు బిచ్చమెత్తుతూ ఉండేవాణ్ణి. ఒక యేడాది కాబోలు పంగనామాలు పెట్టుకొని రామదాసు కీర్తనలు పాడుతూ తిరిగాను. ఆ యేడాది చాలా బాగుంది. నా గొంతు బాగా ఉండడం మూలంగా నేనెక్కడికి వెళ్ళినా గుప్పెడు వడ్లకు బదులు దోసెడు వడ్లు వచ్చేవి. ఆ రోజులు వేఱులే బాబూ! దేశంలో గింజ ఉండేది. కనపడేది. ఒక పల్లెటూళ్ళో కుప్పలు కొట్టే రోజులు. పది కళ్ళాల దగ్గరకు వెళ్ళాను. ఆ పూటకి తూమెడు వడ్లు సంపాదించెను. కాణీ పెడ్తే ఆ పూటకు కావలసిన ఉప్పు, మిరపకాయ, చింతపండూ అన్నీ ఇచ్చేవాడు కోమటి. ఇప్పుడు బియ్యమే కనపడవు. ఇంతలో అరవ బిచ్చగాడికీ నాకూ స్నేహమైంది. వాడితో దక్షిణాది అంతా తిరిగివచ్చాను. ఆ దేవాలయాలు చూడని బ్రతుకెందుకు బాబూ!

బలే కట్టించారు ఆ పూర్వపు రాజులు. ఆ అరవవాడూ చాలా మంచివాడే. వాడు పలకకపోయినా పలకరించి మాటాడాలనిపించుతుంది. అంత మంచివాడు. తిరిగే కాలు తిట్టే నోరు ఊరుకోదని, మేమొకచోట ఉండలేము. నీబుద్ధి నీకర్మను అనుసరించి ఉంటుందని అంటారు. మళ్ళీ తెలుగుదేశం వచ్చాను. ఆ పడమటి ఊళ్ళు వెళ్ళాను. అక్కడ పదేళ్ళ పిల్లల్ని 'వాన' అంటే ఏమిటంటే, వాళ్ళకి తెలియదు. ఈ మాగాని ఊళ్ళల్లో బియ్యం తినటానికి అలవాటు పడ్డ ప్రాణానికి జొన్నకూడు గతకలేదు. ఇక ఆ దేశం వదలిపెట్టి వద్దామనుకొంటుంటే రైలువాళ్ళు రానివ్వలేదు. రైలెక్కటంతోటే వాళ్ళు వచ్చి దింపేవాళ్ళు. పోలీసు వాళ్ళు కొట్టేవాళ్ళు. పోలీసువాళ్ల మీద బలే కచ్చె పుట్టింది. వీళ్ళ పని పట్టాలనిపించింది.

**నేను** - ఇప్పుడు పట్టించావా?

**అతడు** - పట్టించావా? అని అడుగుతున్నావా? ఇప్పుడు నేను చెప్పినట్లు వినాలిసిందే. అది తర్వాత మాట. ఆ స్టేషనులో ఎక్కితే ఈ స్టేషనులో దించారు. అక్కడ ఎక్కితే యింకోచోట దించారు. ఎట్లా అయితేనేం మన దేశానికి తోలుకొని వచ్చాను.

ఇంకో యేడాది ఒక మహారాజింట్లో ఉన్నాను. ఆయన యింట్లో పనీపాట చేస్తుండేవాణ్ణి. ఆయన పెద్ద పండితుడు. భారత భాగవతాలు వాళ్ళింట్లో చదివాను. "*బుద్ధులు భూములేలుతుంటే కర్మం గాడిదల్ని కాస్తోందంటారు.*" అక్కడుండకూడదూ! కాశీకి పోవాలని బయలుదేరాను. ఒకరోజు రాత్రి అదేదో ఊరు వెళ్లాం. నడిరాత్రివేళ రాత్రి రెండు గంటలవుతుంది. బిచ్చమెత్తటం అలవాటైందిగా! ఆ ఊరొక తీర్థం. మరునాడు పరవడి. ఏటి దగ్గఱకు పోయి గుడ్డపఱచి ఒక పుల్లగుచ్చి వద్దామని బయలుదేరాను. వాళ్ల బాస మనకు తెలియదు. బజారు వెంట ఎవళ్ళూ లేరు. ఒక ఆడది. ఒంటినిండా పదివేల రూపాయల నగలుంటవి. గజ్జలగుఱ్ఱం వలె నడచివస్తోంది. ఆ చీకట్లో మెఱిసిపోతోంది. ఆ వెనుక చీకట్లో ఒకడు పట్టా కత్తి చేత్తో పుచ్చుకొని నడచివస్తున్నాడు. నేను వాణ్ణి చూడలేదు. నాకప్పుడు ముప్ఫైయేళ్ళుంటవి. నా దారిన నేను పోగూడదూ? నిలచి ఆడదాని వంక చూచాను. ఆవిడ "బండీకి కట్టిన గుఱ్ఱం బెదరినట్లుగా" రోడ్డుప్రక్కకి లాగింది. నిజానికి నేనేమి అనలేదు. ఇంతలో ఆ వెనుక నున్నవాడు వచ్చి పట్టా కత్తితో నా చేయి నఱికాడు. నేను కేక అయినా వేయలేదు. పడిపోయినాను.

తరువాత పదిరోజులకు ఆస్పత్రిలో నాకు మెలకువ వచ్చింది. తరువాత నెలనాళ్ళకు విడుదల చేశారు. అవిటివాణ్ణి అవటం బిచ్చానికి ఎక్కువ వీలిచ్చింది. నేను సంగీతం పాడి సంపాదించుకోగలను. భారత భాగవతాల్లో పద్యాలు చదివి సంపాదించుకోగలను. మొదటినుంచీ బిచ్చమంటే నాకు అసహ్యం. కుంటివాణ్ణి అని చెప్పుకొని అడుక్కోవటం మరీ నాకు డోకు వేసింది. ఒకరోజున ఒక ఊళ్ళో బిచ్చగాళ్ళ సావిట్లో పడుకొన్నాను. ఇవ్వాళ్ళకి మల్లేనే రాత్రి ప్రొద్దుపోయేదాకా పాడాను. ఒక బిచ్చగాడికి నామీద ఎంతో గౌరవం పుట్టింది. అతడన్నాడు గదా "రంగన్నా! నీవు సంఘంలో చేరరాదా?" అని. అతడే నాకు సంఘం వాకబంతా చెప్పింది. చేరాను గాని మన సంపాదనంతా మనది కాదు. మినహాయిపులు పోతవి. మొదట బాగుండలేదు. తరువాత తరువాత తెలిసింది. సంఘంలో చేరటంతోటే బిచ్చగాణ్ణి అవటం మానేశాను. క్రమక్రమంగా గొప్పదశకు వచ్చాను.

**నేను** – "ఇప్పుడూ బిచ్చగాడివే కదా?"

**అతడు** – నేను చెపుతాననుకో! తెలుసుకోవటం కష్టం ఒక సంసారం ఉందనుకో! బాబూ! పెళ్ళాం ఎంత చెప్పితే అంత. పైకి భర్త సంపాదిస్తున్నట్లు నిర్వాకం చేస్తున్నట్లు కన్పిస్తుంది. అసలు రాణి ఆవిడ. ఇంతకూ నీవు మా కథ వ్రాస్తానంటివిగా! వ్రాసి మాకు చూపించు. మా పేర్లు పెట్టకూడదు. ఊరిపేర్లు వ్రాయగూడదు. నీవు కథ యెట్లా మొదలెట్తావో ఎట్లా ముగిస్తావో! కథ యెందుకో ఒకందుకు చెప్పాలిగా, అదెందుకో తెలిసేటట్లుగా వ్రాయాలి. ఏది యెక్కువ చెప్పగూడదో, ఎక్కడ యెక్కువ చెప్పాలో ఇదంతా చాలా ఉన్నది. ఇంతకూ మా కథ వ్రాయటానికి అప్పుడే వీల్లేదు. మా నాయకుడితో మాట్లాడితేగాని వ్రాయటానికి వీల్లేదు. చాలా రహస్యాలున్నవి. అవి చెప్పవచ్చునంటాడో చెప్పకూడదంటాడో! ఇంతకూ మా నాయకుడికి పై వాళ్ళున్నారు. హిమాలయం దగ్గరనుంచీ రామేశ్వరం దాకా మా సంఘాలున్నవి. అందరూ తలా ఒకచోట. తలా ఒక నాయకుడు. చక్రవర్తి ఉన్నాడు. ఆయన్ని కనుక్కోవాలి. మళ్ళీ రా! ప్రొద్దుపోయింది.

## (4)

తరువాత నా సంసారంలో చాలా మార్పులు జరిగినవి. అనేక ఆపదలు వచ్చినవి. పదేండ్లు గడచినవి. ఈ పదేండ్లలో నేనా ఊరు కూడా చాలాసార్లు వెళ్ళలేదు. ఒకసారి దూరాన్నుంచి చూచాను. ముగ్గురు మాత్రం ఉన్నారు కాని వాళ్లు మునుపటి ముగ్గురు కాదు. బుంగన్న బుంగన్నే. రంగన్న మాఱిపోయాడు. రంగన్నకు బదులు ఇంకెవరో వచ్చారు. మొత్తాన వాడికీ కుడిచేయి లేదు.

మళ్ళీ ఒకసారి చూచాను. మళ్ళీ ఏదో మార్పున్నది. నాకు చాలా చమత్కారం వేసింది. మనుష్యులు మారినా ముగ్గురి సంఖ్య మారటం లేదు.

ఒకసారి దగ్గరగా చూచాను. నాతోపాటు వాళ్ళకీ యేళ్ళు వస్తున్నవి. వాళ్ళల్లో యేమీ మార్పు కన్పడలేదు. వాళ్ళు నవయౌవనులు లాగానే ఉన్నారు. వాళ్ళ ఠీవికేమీ తఱుగు రాలేదు.

మళ్ళీ కొన్నాళ్ళకు చూచాను. అది చివరిసారి చూడటం. చివరిసారి అంటే మళ్ళీ నా కథ అందుకొనేసారిలో అన్నమాట. ఇప్పుడు ముగ్గురు కాదు. నలుగురున్నారు. యుద్ధాలు రెండూ- ప్రపంచ యుద్ధాలు - అయిపోయినవి. ఇవి కొద్ది రోజుల క్రిందటి మాట.

నేను రైల్లో కూర్చున్నాను. నలుగురూ కిటికీ దగ్గర నిలుచున్నారు. నాలుగోవాడికి కొంచెం గడ్డం ఉంది. పూర్వం బుంగన్న దూరంగా నిలుచున్నాడు. ఇప్పుడు ఈ గడ్డం వాడు దూరంగా నిలుచున్నాడు. నిలుచోలేదు. వాడి ముఖం చూస్తే కొంచెం భయంకరంగా ఉంది. ఏదో చాలా హత్యలు చేసి వీళ్ళతో పాటు గొప్పవాడు అయినవాడల్లే ఉన్నాడు.

నేను సాంకేతికంగా బుంగన్నతో మాట్లాడాను. నా యెదురుగుండా ఒక స్నేహితుడు కూర్చున్నాడు. అది వరకేదో ప్రసంగాన్ని అనుసరిస్తున్నట్లుగా స్నేహితుడితో అన్నాను. "ఈ మధ్య చాలా చిక్కులు వచ్చినవి. పదేళ్ళపైన గడిచింది. కథ అట్లాగే ఉండిపోయింది. ఇవ్వాళ రాత్రికి వెళ్ళుదామనుకొంటున్నాను" అని బుంగన్న వంక చూచాను. బుంగన్న సరే అన్నట్లుగా ఉంది.

టిక్కెట్టు కొన్నవాణ్ణి వాపసు ఇచ్చి ఉండిపోయినాను.

రాత్రి పదింటికి బుంగన్న ఉండేచోటికి వెళ్ళాను. తలుపు వేసి వుంది. తలుపు తట్టాను. ఇంట్లోంచి ఆడవాళ్ళు ఎవరో వచ్చి రండి అన్నారు. తరహా చూస్తే నాకు వెగటు వేసింది. వద్దులే అని వెనక్కి తిరిగి వచ్చాను. మఱి బుంగన్న ఎక్కడున్నాడు? మఱునాడు మళ్ళీ స్టేషనులో కనిపించాడు. ఇంకో మార్గం కనిపించలేదు. సాయంత్రం దాకా అటూ ఇటూ తిరిగి ప్రొద్దు గ్రుంకిన తర్వాత బుంగన్న వెంటనే వెళ్ళాను. ఇప్పుడు బుంగన్న ఉంటున్న యిల్లు చిన్నగది కాదు. పెద్ద యిల్లు. జనం వస్తున్నారు. పోతున్నారు.

నేను వెళ్ళటంతోటే బుంగన్న "వస్తున్నాను కూర్చోండి" అని గంటసేపటికి వచ్చాడు. వచ్చి, "యిప్పటికి తీరిక అయింది. ఇప్పుడు నేను చక్రవర్తిని. రాజ్యం అంతా చక్కదిద్దుకొనేటప్పటికి కష్టం అయిపోతోంది" అన్నాడు. నాకారోజున సింగన్న చెప్పిన కథ జ్ఞాపకం వచ్చింది. బుంగన్న మళ్ళీ అన్నాడు "ఇన్నేళ్ళకు వచ్చారేమి? వచ్చినా మంచిదే. ఇప్పుడు మా సంగతంతా మీతో చెప్పవచ్చు. నన్నడిగేవాడెవ్వడూ లేడు. కాని ఒక్క సంగతి. మన స్నేహం ఇరవైయేళ్ళది. నేను చెప్పే మాటలు అందరికీ తెలియకుండా ఉండటం మంచిది. తెలియజేస్తే ఒడుపుగా తెలియజేయాలి. అందరికీ తెలిసిన విషయాలేననుకోండి. మీ సంసారాల్లో రాజ్యాలల్లో అందరికీ తెలిసిన విషయాలే గోప్యంగా ఉంచుకొంటారు. అందరకూ తెలుసు. ఎవళ్ళకి వాళ్ళు చెప్పుకొంటూనే ఉంటారు. సభలలో బహిరంగంగా మాత్రం అనకూడదు. అది మీ మర్యాద. మాది యింకా గోప్యం – రాజుగారొకదానిని ఉంచుకొన్నాడనుకోండి. ఆయన యెదుట రాణీగారనే అంటాం. బయటకు వచ్చి ఉంచుకొన్నది అంటాం. మా స్థితి దీనికెదురు. నిజానికి రాణీగారు చెప్పవలసి వస్తే ఉంచుకొన్నదని, రాణీగారని అందరికీ తెలుసు. అల్లాగా మేము పైకి బిచ్చగాళ్ళం. అందరూ బిచ్చగాళ్ళనే అంటారు. మేము ప్రభువులమని అందరికీ తెలుసు.

**నేను** – నాకు తెలియదే!

**బుంగన్న** – మీకు తెలియకపోతే తప్పు నాది కాదు. దాచటం ఎందుకు? అసలు రహస్యం చెబుతాను. మీ మంత్రులు, రక్షకభటులు, ఉద్యోగస్థులు రాజ్యం చేస్తున్నారని మీరనుకొంటారు. నిజంగా రాజ్యం చేసేది మేము. పెద్ద ఉద్యమాలు లేవదీసేది మేము. దొంగతనాలు, శిక్షలూ అన్నీ వేయించేది మేము.

**నేను** - నాకర్థం కావటం లేదు.

**బుంగన్న** - మీ రక్షకభటులందరూ మాచేతుల్లో ఉన్నారు. మీ ఉద్యోగస్థులందరూ మా చేతుల్లో ఉన్నారు. మేము వాళ్ళకు మామూళ్ళు ఇస్తాము. మేమెల్లా చెప్పితే వాళ్ళట్లా నడవాలిసిందే. మాకు సంబంధంలేని దొంగతనాలైతే మీ న్యాయస్థానాలలో విచారణలూ, శిక్షలూ జరుగుతవి. మా సంబంధం ఉంటే జరుగవు. ఆ శిక్షలు మేమే వెయ్యాలి. మమ్మల్ని మించిన అధికారం లేదు.

నా తలంతా తిరిగిపోతోంది. అతడు చెప్పే మాటల్లో లీలగా నిజం ఉన్నట్లేదో అనిపిస్తోంది. నిస్పష్టంగా భాసించటం లేదు. బుంగన్న మళ్ళీ అన్నాడు. "ఈ మధ్య మీకు రెండు మూడాపదలు వచ్చినవి. మిమ్మల్ని ఒకసారి రక్షకభటులు పట్టుకొని రాత్రిపూట చెఱలో ఉంచి ప్రొద్దుటనే వదలిపెట్టారు. ఆ వదలి పెట్టించింది నేనే."

నాకేమనటానికీ తోచలేదు. కృతజ్ఞత చెప్పనా? ఇంత చెహరాగల మనిషిని కాదని యెట్లా అనను?

**నేను** -అన్ని ఉద్యమాలు మీరే లేవదీస్తారంటావు. అదీ యెలా?

**బుంగన్న** - 'మీకు రుజువు కావలిస్తే ఇప్పుడే చూపిస్తా అని ఒకనిని పిలిచాడు. పిలిచి, "అయ్యగారితో నీ సంగతి చెప్పు"అన్నాడు. అతడు వెలాతెలా పోయి చూచాడు. బుంగన్న "ఫర్వాలేదు చెప్పు" మన్నాడు. అతడు ఇలా చెప్పాడు.

"నేను వంగదేశానికి వెళ్ళి అక్కడ ఒక ఉద్యమాన్ని లేవదీయాలి. ఒక సభ జరుగుతూన్న సమయంలో రక్షకభటులు పోయి సభను చెల్లాచెదరు చేయాలి. అక్కడనుంచి ఆ ఉద్యమం పెరుగుతుంది. బాగా పెరిగిన తరువాత ఆ ఉద్యమానికి మా సంఘం దోహదం యిస్తుంది. డబ్బు మేమిస్తాం. దానితో- అటు రాచరికం అనుకొనేవాళ్ళకీ, ఇటుప్రజల్లో ఒక భాగానికీ తగాదా పెరుగుతుంది."

**నేను** - దీనివల్ల మీకేమి లాభం?

**బుంగన్న** - అధికారులు మా చెప్పుచేతల్లో ఉంటారు. లేకపోతే రాజ్యం మీద మా అధికారం పోతుంది.

**నేను** – ఈ ఉద్యమాలన్నీ మీరు లేవదీసినవేనా?

**బుంగన్న** – కొన్ని మేము లేవదీసినవి. "ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క దేశభాగంలో రక్షకభటులూ ఉద్యోగులూ మా అదుపు మీఱిపోతుంటే మేమిట్లా చేస్తుంటాం."

ఇంతలో ఒకడు వచ్చాడు. బుంగన్నతో ఇల్లా విన్నవించుకొన్నాడు. "బుంగన్నా! సంఘానికి డబ్బు లేకపోతే నా తమ్ముడు దొంగతనం చేశాడు. వాడికి రెండేళ్ళు ఖైదు వేశారు. సంఘం యేమీ చేయలేదు. వాడి కుటుంబం గడవటం ఎలా?"

**బుంగన్న** – "క్రింది న్యాయస్థానంలోనే గదా! ఆ అధికారి క్రొత్తగా వచ్చాడు. ఈ ఊళ్ళో సిఫారసులు పట్టలేదు. పై ఊరి నుంచి సిఫారసు వచ్చేదాకా ఆగలేదు. ఇంతకూ ఆ రక్షకభటాధికారి యీ పనిచేశాడు. వాడూ క్రొత్తగా వచ్చాడు. వాడు మామూళ్ళు తినేరకం కాదట. నేను చూస్తాను. ఫర్వాలేదు. పో. అంతగా కాకపోతే యీ రెండేళ్ళు నెలకి ఇరవై రూపాయలిప్పిస్తాను" అన్నాడు.

వాళ్లిద్దరూ వెళ్ళిపోయినారు.

**నేను** – బుంగన్నా! ఈ వ్యవహారం నాముందర యింత బహిరంగంగా చేస్తున్నావు. నేనెవరితో చెప్పనని నీకెట్లా?

**బుంగన్న** – చెప్పితే మాత్రమేమి తప్పు? పైగా మీ పని యింతటితో అయిపోయిందా? ఇహ ఇక్కడినుండి మీరెఱిగియున్న వాళ్ళకి మీరు కూడా సిఫారసులు చేసి పెట్టాలి."

**నేను** – చాలా బాగుంది.

**బుంగన్న** – "బాగా ఉండదా? బిచ్చగాళ్ళ రాజ్యం ఇల్లాగే ఉంటుంది. రాజ్యం ఎప్పుడూ బిచ్చగాళ్ళదే."

నేను నవ్వాను.

బుంగన్న మళ్ళీ అన్నాడు. "ఎందుకు నవ్వుతారు? బిచ్చగాళ్ళది రాజ్యమేమిటా అనా? మీరు చదువులలో మర్మమెల్ల చదువలేదు. ప్రపంచంలో ఇన్ని మతాలున్నవి. ఈ మతాలను గుఱించి పోట్లాటలున్నవి. ఈ మతాలు

నిర్మించింది యెవరు? సన్యాసులు. సన్యాసులంటే బిచ్చగాళ్ళు. పోతులూరి వీరబ్రహ్మం, వేమన్న, వీళ్ళెవరు? ఏసుక్రీస్తు, మహమ్మదు, శంకరుడు, వీళ్ళందరు ఎవరు? సన్యాసులు, బిచ్చగాళ్ళు. బుద్ధుడున్నాడంటే - తాను మతం మొదలు పెట్టేసరికి సన్యాసి కావలసివచ్చింది. మత విషయకంగా లోకాన్ని పాలించేది సన్యాసులు. ఈ సన్యాసులు ఎట్లా చెప్పితే అట్లాసాగినవి పూర్వపు రాజ్యాలు. ఒక్క మత విషయకంగానే కాదు. ఏవిధంగా చూచినా దేశాలను పాలించేవాళ్ళు బిచ్చగాళ్ళు. బిచ్చగాళ్ళలో భేదాలుంటవి. పొరపాటు పడవద్దు. బిచ్చగాళ్ళు మీలోనే ఉంటారు. వాళ్ళు అధికారం చేస్తుంటారు. వాళ్ళు మా వాళ్ళే. మీకు తెలియక అధికార్లనుకొంటారు. వాళ్ళందరూ మా మామూళ్ళు తినేవాళ్ళే. ఒకడు ప్రత్యక్షంగా తింటాడు. ఒకడు పరోక్షంగా తింటాడు. ఒకడు చేయి చాపుతాడు. ఒకడు దూరంగా నిలుచుండి భాగం తీసుకుంటాడు. అసలు రహస్యం చెపుతా వినండి. లోకంలో మానవజాతి రెండే రకాలు. ఒక రకం సంసారులు. రెండవరకం బిచ్చగాళ్ళు. అధికారులనండి, సన్యాసులనండి, మతగురువులనండి, రాజకీయవేత్తలనండి, కవులనండి, గాయకులనండి, వీళ్ళందరూ రెండవ రకం. వీళ్ళు బిచ్చగాళ్ళు. వీళ్ళకీ సంసారాలు చట్టుబండలూ అక్కరలేదు. వీళ్ళకు కొట్టుకు తినటం ప్రధానం. పెళ్ళాం బిడ్డలుంటే జంతుధర్మం. ఆత్మధర్మం బిచ్చగానితనం... ఎవడిజోలీ తనకక్కరలేదు. తానేదో న్యాయంగా సంపాదించుకొంటాడు. తింటాడు. వాడు లోకాన్ని ఉద్ధరిస్తానని బయలుదేరడు. ఇట్లాంటివాడు సంసారి. లోకంలో యెక్కువమంది వీళ్ళు. వాళ్ళమీద బ్రతికేవాళ్ళు బిచ్చగాళ్ళు. బిచ్చగాణ్ని అంటే ఎవరు పెడ్తారు? ఈ సంసారులమాయకులు. వాళ్ళోలోకం. వాళ్ళనెవరూ ఉద్ధరించనక్కరలేదు. మిమ్మల్ని ఉద్ధరిస్తామంటే వాళ్ళు నిజమేనని నమ్ముతారు. ఆ రీతిగా బిచ్చగాడు అధికారం సంపాదిస్తాడు. ఒక రక్షకభటుడున్నాడు. వాడికి ఉద్యోగం పోతే మేము రక్షించాలి. మేమెట్లా రక్షిస్తాం? ఈ సంసారులున్నారే! వాళ్ళొక విచిత్రమైన సృష్టి. వాళ్ళకు ఏ జోలీ సొంటీ అక్కరలేదు. నీవు వెళ్ళి చెప్పితే వింటారు. నేను వెళ్ళి చెప్పినా వింటారు. అసలు పుట్టుతూనే కొందరు బిచ్చగాళ్ళు. కొందరు సంసారులు. మేము ఉద్యమాలు లేవదీస్తామంటే ఎవళ్ళ చేత లేవదీయిస్తాం? సంసారి కావటానికి చాలామంది పనికిరాకపోతారు.

వాళ్ళందరూ బిచ్చగాళ్ళవుతారు. వాళ్ళని బిచ్చగాళ్ళని మేము చేస్తాము. వాళ్ళచేత ఉద్యమాలు లేవదీయిస్తాము. 'నీవు బిచ్చగాడివి కాదా' అంటే కాడు. వాడికి అధికారము, లోకోద్ధరణము అనే ఆశలు చూపిస్తాము. గతి లేనివాడు లోకోద్ధరణ చేయక యేం చేస్తాడు? మా బిచ్చగాళ్ళలో చేరుతాడు. ఈలోకమంతా బిచ్చగాళ్ళే యేలుతున్నారు. మాది గొప్ప సంస్థ. మాది గొప్ప సంఘం".

అతని పాండిత్యం ముందర నా తెలివితేటలేమీ పనికిరాలేదు. నేను రాత్రి రెండు గంటల దాకా కూర్చొని తికమక ప్రశ్నలు వేస్తూనే ఉన్నాను. అతడు ప్రతిదానికీ సమాధానం చెపుతూనే ఉన్నాడు. అన్ని సమాధానాలు ఆ మూల సిద్ధాంతంలో నుంచే వస్తున్నవి. ఎన్ని చెప్పినా అతడు వినడు. బిచ్చగాళ్ళే రాజ్యం చేస్తున్నారంటాడు. లేకపోతే వాళ్ళకేమి పట్టింది? వాళ్ళ సంసారాలు వాళ్ళు చేసుకోరా? శాంతంగా బ్రతుకలేరా! అంటాడు. ఈ అధికారం వాళ్ళ కెవరిచ్చారో చెప్పండి అంటాడు. నేను చెప్పాను. దానికి ఒప్పుకోడు. ఆ పథకం పెట్టింది మేమే. మమ్మల్ని ఎన్నుకోమని చెప్పాం. ఒకణ్ణి ఎన్నుకోక వాళ్ళకి తప్పదు. నాకివ్వకపోతే మాగడ్డం  వాడికిస్తారు."

**నేను** - "వాడెవ్వ"డన్నాను. బుంగన్న నవ్వి "క్రొత్తగా వచ్చాడు. నాయకుడైనాడు. నా కన్న గొప్పవాణ్ణి అంటాడు."

సరే నేను వెళ్తానన్నాను. "నీ సిద్ధాంతం ఇంతేనంటావా" అన్నాను.

బుంగన్న గంభీరమైన ముఖంతో నిలుచున్నాడు. "కొందరికి ఎంత చెప్పినా తెలియదు. అందులో నీవొకడవల్లే ఉన్నావు. మళ్లీ చెబుతున్నాను. సంసారులు - బిచ్చగాళ్ళు రెండే రకాలు మానవులు. మతాలు, అధికారాలు, రాజ్యాలు సంసారులకు పట్టవు. వాళ్ళు మేకలవంటివాళ్ళు. అవన్నీ బిచ్చగాళ్ళకు, మాకు పట్టుతవి. మేము తోడేళ్లవంటి వాళ్ళం. ఈ రెండు రకాల మనుష్యులు పుట్టటంతోటే అల్లా పుట్టుతారు."

అతని నిశ్చయం చూస్తే నేనేం మాట్లాడినా ఊరుకొనేటట్లు లేదు. నిజానికి నేను అతను చెప్పిన మాటలు నమ్మలేదనటానికి వీల్లేదు.